

జములమ్మ కల్యాణం

నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి కల్యాణం మంగళవారం కనులపండువగా జరిగింది.

-8లో ▸



జూరాలకు పోటెత్తిన వరద

జూరాలకు మంగళవారం 2.45 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 38 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

-8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.6 /22.4

ఆకాశం నిర్మానుష్యంగా మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలనుకునే యువత, మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈపథకం ద్వారా బ్యాంకు రుణాలతో పాటు కేంద్ర నిధుల నుంచి సబ్సిడీ అందుతుందని తెలిపారు. ఏప్రిల్ నుంచి సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ పోర్టల్ సేవలు నిలిచిపోయాయని, ప్రస్తుతం పునరుద్ధరించబడినందున ఆసక్తి గల అభ్యర్థులు www.kvionline.gov.in.pmegpeportal ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈపథకం ద్వారా జిల్లాలో మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

అలంపూర్ రూరల్: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సిద్దప్ప అన్నారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీని సందర్శించి ఫార్మసి గది, షేషెంట్స్ గది, రికార్డులను పరిశీలించారు. వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రసన్న రాణి, వరలక్ష్మీ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

అయిజ: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను డీఈ తిరుపతిరావుతో కలిసి ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలోని 132 /33 కేవీ సబ్‌స్టేషన్‌లో 31.5 ఎంవీఏ శక్తిని 50 ఎంవీఏకు పెంచనున్నట్లు తెలిపారు. పట్టణాల్లో, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన టీవీ చానెల్ కేబుల్ వైర్లను డిష్ నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించకుంటే ప్రాణ నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గోవిందు, ఏఈ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గద్వాల యువతికి నాయక్, రస్తోగి అవార్డు



కొంకతి ప్రీతి

గద్వాల న్యూటౌన్: ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగానికి సంబధించి పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ముంబాయి (ఐఐటీ ముంబాయి) వారు నాయక్, రస్తోగి అవార్డును 2012 నుంచి అందిస్తున్నారు. ఈ ఏడాది ఈ అవార్డును గద్వాలకు చెందిన కొంకతి ప్రీతి పొందారు. ఆసియాలోనే ప్రతిష్టాత్మకమైన అవార్డులలో ఇది ఒకటి. అవార్డుపై విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

సం‘పత్తి’ కలిగేనా..?!

నడిగడ్డలో అత్యధికంగా సీడ్ పత్తి సాగు



సల్కాపురం శివారులో క్రాసింగ్ పనులు చేస్తున్న కూలీలు

- ఇటీవల రైతును కలవరపెడుతున్న ఎడతెరిపి లేని వర్షాలు
- మధ్యవర్తుల కొత్త నిబంధనలతో పరేషాన్
- జిల్లాలో 22,783 ఎకరాల్లో సీడ్ పత్తి.. 1.05 లక్షల ఎకరాల్లో కమర్షియల్ పత్తి సాగు

గట్టు: పేరెన్నిక కల్గిన పత్తి విత్తనాలను అందించడంలో నడిగడ్డ ప్రాంతం రాష్ట్రంలోనే పేరుగాంచింది. అయితే, ఈ ఏడాది సీడ్ పత్తి రైతును ఎడతెరిపి లేని వర్షాలు.. మధ్యవర్తుల కొత్త నిబంధనలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. భారీ వర్షాలతో క్రాసింగ్ చేసినవి కాయలుగా మారకుండా రాలిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఎకరాకు కేవలం 150 నుంచి 200 పాకెట్ల విత్తనాలు మాత్రమే కొంటామని.. అంతకుమించి సాగుచేస్తే కొనమని మధ్యవర్తులు చెబుతుండడం కలవరపెడుతోంది. విధిలేని పరిస్థితుల్లో కొంతమంది రైతులు మధ్యలోనే పంట వదిలేస్తుండగా.. మరికొందరు యథావిధిగా సాగు చేస్తున్నారు. మొత్తంగా ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందా.. లేదా అన్న అనుమానం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా పత్తివిత్తనోత్పత్తి సాగు 22,783 ఎకరాల్లో, కమర్షియల్ పత్తి 1,05,101 ఎకరాల్లో సాగు అవుతోంది.

ఎడతెరిపి లేని వర్షాలతో ముప్పు..

ఎకరా సీడ్‌పత్తిని సాగు చేస్తే పెట్టుబడిగా రూ.లక్ష నుంచి 1.5 లక్షల వరకు పెట్టుబడి పెడతారు. జూన్ ప్రారంభంలో పత్తివిత్తనోత్పత్తిని సాగు చేస్తుండగా, జూలై చివరి వారం నుంచి క్రాసింగ్ పనులు (మగ పువ్వు పుప్పొడిని ఆడ పువ్వుతో క్రాసింగ్) ప్రారంభిస్తారు. ఇలా 30 నుంచి 60 రోజుల పాటు క్రాసింగ్ పనులను చేపడతారు. ఇలా ఆరుమాసాల్లో పంటకాలం పూర్తి చేస్తారు. ఈ క్రాసింగ్ పనులకు ఎకరాకు 5 నుంచి 7 మంది కూలీల దాకా అవసరం అవుతారు. వీరికి నెలకు రూ.18వేల నుంచి రూ.21 వేల వరకు కూలీ చెల్లిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, ఎమ్మిగనూర్ ప్రాంతాలతో పాటుగా కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి కూలీలను రప్పిస్తుంటారు. అయితే, భారీ వర్షాలతో క్రాసింగ్ చేసినవి కాయలుగా మారకుండా రాలిపోతాయన్న భయం రైతులను వెంటాడుతోంది.

జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి సాగు ఇలా.. (ఎకరాల్లో)

మండలం	సీడ్ పత్తి	కమర్షియల్ పత్తి
వడ్డేపల్లి	185	13,700
ఇటిక్యాల	911	13,550
మల్దకల్	4,535	13,550
అయిజ	1,050	13,110
మానవపాడు	52	10,086
గద్వాల	2,000	8,000
ఉండవెల్లి	--	7,873
రాజోళి	150	7,322
ఎర్రవల్లి	--	6,690
గట్టు	7,840	6,340
కేటీదొడ్డి	3,460	2,920
అలంపూర్	--	1,850
ధరూరు	2,600	108

ముందస్తు ఒప్పందంతో ఆందోళన

పత్తివిత్తనోత్పత్తి సాగులో ముందుస్తు ఒప్పందం మేరకు జూన్ మొదటి వారంలోనే రైతులకు విత్తనాలతో పాటుగా పెట్టుబడి కోసం మధ్యవర్తులు కొంత డబ్బులను అందజేస్తారు. అయితే, 45 రోజుల తర్వాత ఎకరాకు కేవలం తాము 150 నుంచి 200 ప్యాకెట్లు మాత్రమే కొంటామని, అంతకన్నా ఎక్కువ పండిస్తే తాము కొనలేమని చెబుతుండడంతో పత్తి రైతులు పరేషాన్ అవుతున్నారు. ముఖ్యంగా పూత రాసే (జీఎంఎస్, స్టేరల్స్) వెరైటీ సీడ్ పత్తి పంటను సాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ఎకరాకు 4 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా.. క్వింటన్నర, రెండు క్వింటాళ్లు మాత్రమే కొంటామని చెబుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు పత్తి మొక్కలను తొలగించుకుని వేరే పంటలను సాగు చేసుకోగా, మరికొంత మంది అలాగే కొనసాగిస్తున్నారు. రైతులకు పంటల సాగుకయ్యే పెట్టుబడి డబ్బులను మధ్యవర్తులు నిలిపి వేయడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.



గట్టు శివారులో ఏపుగా పెరిగిన సీడ్ పత్తి

మధ్యవర్తులదే కీలకపాత్ర

పత్తివిత్తనోత్పత్తి సాగులో అటు కంపెనీకి, ఇటు రైతులకు మధ్య మధ్యవర్తులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ముందస్తు ఒప్పందం మేరకు రైతుకు కేజీ పాకెట్ ధర రూ.450 నుంచి రూ.600 వరకు కంపెనీలను బట్టి ధరను నిర్ణయించి చెల్లిస్తుంటారు. రైతులు ఒప్పందం చేసుకున్న మధ్యవర్తి ద్వారానే పంట పండించిన గింజలను అప్పగించాల్సి ఉంటుంది. వేరే వ్యక్తులుకానీ, ఇతర కంపెనీలు సైతం నేరుగా రైతులతో విత్తనాలను కొనవు. మధ్యవర్తులు డబ్బులను మాత్రం జూలై నెలలో రైతులకు అందిస్తుంటారు. పంట సాగు కోసం మధ్యవర్తి ద్వారా తెచ్చుకున్న డబ్బుకు వడ్డీతో సహా రైతులు చెల్లించిన అనంతరం మిగులుబాటు అయితేనే డబ్బులు రైతుల చేతికిస్తారు. లేకపోతే అప్పును తీర్చేందుకు రైతు మరో ఏడాది పంటను సాగు చేయాల్సి వస్తుంది. ఇలా ప్రతి రైతు ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దాకా గింజలను పండిస్తుంటారు.

వర్షాలతో ఇబ్బంది



సీడ్ క్రాసింగ్ పనుల కోసం ప్రతి ఏటా జూలై ఈ ప్రాంతానికి వస్తాం. రైతులు మాతో ముందస్తుగా మాట్లాడుకుంటారు. నెలకు రూ.20వేల నుంచి రూ.22వేలు చెల్లిస్తారు. రైతు వీలును బట్టి 30 నుంచి 60 రోజుల వరకు క్రాసింగ్ పనులు చేపడతాం. ఈ ఏడాది ఎడతెరిపి లేని వర్షాలతో కొంత ఇబ్బంది నెలకొంది. క్రాసింగ్ చేసినవి కాయలుగా మారకుండా రాలిపోతాయనే భయం వెంటాడుతోంది.

– యాకోబు, వలస కూలి, గుడేకల్లు గ్రామం, ఎమిగనూర్ మండలం, కర్నూలు జిల్లా

ఇక సాగనంపడమే..



కుడిచింతల్‌బైల్ గ్రామంలో చెంచుల కోసం స్వచ్ఛంద సంస్థ కట్టించిన ఇళ్లు

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని చెంచుపెంటల తరలింపునకు కేంద్రం ఆమోదం

- నల్లమల అడవి నుంచి రెండు దశల్లో 5 గ్రామాల రీలొకేషన్
- నిర్వాసితుల నుంచి ఎంఓయూ ఒప్పందం అనంతరం ప్రారంభంకానున్న ప్రక్రియ
- ప్రభుత్వం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాకే తమను పంపించాలంటున్న చెంచులు
- పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద పునరావాసం

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో కోర్ ఏరియాలో ఉన్న ఐదు చెంచుపెంటల రీలొకేషన్‌కు కేంద్ర పర్యావరణ శాఖ సలహాకమిటీ ఆమోదం తెలిపింది. రెండు విడతల్లో ఐదు చెంచుపెంటల్లోని స్థానికులను అడవి నుంచి బయటకు తరలించి అక్కడ పునరావాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర పర్యావరణ శాఖ సలహా కమిటీ సూత్రప్రాయంగా ఆమోదించడంతో గ్రామాల రీలొకేషన్ ప్రక్రియ మొదలుకానుంది. మొదటి విడతలో కుడిచింతల్‌బైల్, కొల్లంపెంట, తాటిగుండాల పెంటల్లోని 417 కుటుంబాలతో పాటు రెండోవిడతలో వటవర్లపల్లి, సార్లపల్లి గ్రామాల్లోని 836 కుటుంబాలను అడవి నుంచి బయటకు తరలించి ప్రభుత్వం పునరావాసం కల్పించనుంది.

వన్యప్రాణులు – మనుషులకు మధ్య ఘర్షణ నివారించేందుకు..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని కోర్ ఏరియాలోని చెంచుపెంటల్లో నివసిస్తున్న స్థానిక చెంచులను ఇక్కడి నుంచి తరలించి నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం సమీపంలో పునరావాసం కల్పించనున్నారు. టైగర్ రిజర్వ్ పరిధిలోని పులులు, వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవాసాలకు ఆటంకాలను నిర్మూలించడం, మనుషులకు – వన్యప్రాణులకు మధ్య ఘర్షణలను నివారించేందుకు, పర్యావరణ సంరక్షణలో భాగంగా జాతీయ పులుల సంరక్షణ అథారిటీ(ఎన్టీసీఏ) నిర్వాసితులకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అందిస్తోంది. స్వచ్ఛందంగా అడవి నుంచి బయట నివసించాలనుకునే వారికి ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సహాయం లేదా ఇల్లు, ఐదెకరాల వ్యవసాయ భూమిని అందిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే రీలొకేషన్ సర్వే, గ్రామసభలు నిర్వహించిన అటవీశాఖ అధికారులు గ్రామస్తుల నుంచి అంగీకారపత్రాలను తీసుకున్నారు. సార్లపల్లి గ్రామంలోని 30 కుటుంబాలు మినహా, కొల్లంపెంట, కుడిచింతల్‌బైల్, తాటిగుండాల, వటవర్లపల్లి గ్రామాల్లోని స్థానికులు రీలొకేషన్‌కు అంగీకారం తెలిపారు.

ఎంఓయూ అనంతరం ప్రారంభంకానున్న ప్రక్రియ..

గ్రామసభలు, జిల్లాస్థాయి కమిటీ, రాష్ట్రస్థాయి కమిటీ, జాతీయ పులుల సంరక్షణ అథారిటీ(ఎన్టీసీఏ) కమిటీల ఆమోదం మంగళవారం కేంద్రం పర్యావరణశాఖ సలహా కమిటీ సైతం ఆమోదం తెలిపింది. దీంతో నిర్వాసితుల నుంచి మెమొరెండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్(ఎంఓయూ) పత్రాలపై సంతకాలను తీసుకున్న తర్వాత గ్రామాల రీలొకేషన్ ప్రక్రియ ప్రారంభంకానుంది. మరో రెండునెలల్లోనే ఈ ప్రక్రియ మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు. రీలొకేషన్ ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందంగా ఉంటుందని అటవీశాఖ అధికారులు అంటున్నారు.

జీవనోపాధిపై నమ్మకం కల్పించండి

తమకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా పూర్తిస్థాయిలో పునరావాసం పూర్తయిన తర్వాతే అడవి నుంచి తరలించాలని చెంచులు కోరుతున్నారు. ఏళ్లుగా అడవినే నమ్ముకుని బతుకున్న తమకు బయటకు తీసుకెళ్లాక జీవనోపాధి కరువవుతుందని ఆందోళన చెందుతున్నారు. పునరావాసం తర్వాత ఉపాధి లేక ఇబ్బందులు పడతామని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించడంతో పాటు జీవనోపాధిపై నమ్మకం కలిగించాకే తమను అడవి నుంచి బయటకు తరలించాలని కోరుతున్నారు.

అడవిలో తప్ప బయట బతకలేం..



మేం ఏళ్లుగా మా తాత ముత్తాతల నుంచి అడవిలో ఉంటున్నాం. అడవిలో ఉన్న ఆధారం మాకు బయట దొరకదు. ఇక్కడ దొరికింది తిని బతుకుతున్నాం. బయటకు పోయినంక మాకు దిక్కు ఎవరు ఉంటరు. గ్రామాలు అన్నీ వెళుతున్నాయని అంటున్నరు. మేం అడవిలోనే ఉంటాం.

– దంసాని లింగయ్య, కొల్లంపెంట, అమ్రాబాద్ మండలం

పునరావాసం ఇచ్చాకే పోతాం..



మేం ఏళ్లుగా అడవినే నమ్ముకుని బతుకుతున్నాం. మాకు వేరే పని తెలువదు. పులులు, వన్యప్రాణుల కోసం మమ్మల్ని బయటకు పొమ్మని అంటున్నారు. మాకు చెప్పినట్టుగా పూర్తిగా పరిహారం, ఇల్లు, భూమి ఇచ్చాకనే పోతాం.

– గోరటి చంద్రమ్మ, కుడిచింతల్‌బైల్

అన్ని పూర్తయ్యాక తరలించాలి..



అడవి నుంచి బయటకు తీసుకెళ్లి అక్కడ ఇళ్లు కట్టించి ఇస్తామంటున్నారు. వ్యవసాయం చేసుకునేందుకు భూమి ఇస్తాం అని చెప్పారు. అన్నీ చెప్పినట్టుగా ఇస్తేనే ఇక్కడి నుంచి బయటకు పోతాం. పోడు భూములు, నమ్ముకున్న అడవిని విడిచి పోతే మాకు బతికేందుకు పని కల్పించాలి.

– పోషప్ప, కుడిచింతల్‌బైల్, అమ్రాబాద్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

మానవీయ కోణంలో చేపడతాం..



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో రెండు దశల్లో గ్రామాల రీలొకేషన్ ప్రక్రియ ఉంటుంది. నిర్వాసితులకు ఎన్టీసీఏ ద్వారా పూర్తిస్థాయిలో పరిహారం అందించాకే రీలొకేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. రీలొకేషన్ కోసం స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వారికే ప్యాకేజీ అందించి తరలింపు చేపడతాం.

– రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్, జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

యూరియా కోసం రైతుల ఆందోళన



అయిజ సింగిల్‌విండో కార్యాలయం ఎదుట గుమిగూడిన రైతులు



గట్టు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

- అయిజ సింగిల్‌విండో కార్యాలయం దిగ్బంధం
- గట్టు పీఏసీఎస్ వద్ద రాత్రి వరకు ఎదురుచూపులు

గద్వాల/గట్టు/అయిజ: విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలకు సంబంధించి సరిపడా యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం అయిజ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని రైతులు దిగ్బంధించగా.. గట్టు పీఏసీఎస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పూర్తి వివరాలిలా.. మూడు రోజుల వరుస సెలవుల నేపథ్యంలో అయిజ సింగిల్‌విండో కార్యాలయానికి యూరియా సరఫరా నిలిచిపోయింది. మార్క్‌ఫెడ్ నుంచి వచ్చిన 300 బస్తాల యూరియా కోసం రైతులు ఒకేసారి గుమికూడడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈసందర్భంగా సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్లో యూరియా సరిపడినంతగా సరఫరా కాకపోవడం, బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతులంతా ఒకేసారి సింగిల్‌విండో కార్యాలయానికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నా యని అన్నారు. సరిపడా యూరియాను సరఫరా చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

ఉదయం నుంచి రాత్రి వరకు బారులు..

గట్టు పీఏసీఎస్ ఎదుట మంగళవారం యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు బారులుతీరారు. ఉదయం 6-30 గంటల నుంచే రాత్రి వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. రైతుల రద్దీని గమనించి పోలీసుల పీఏసీఎస్ దగ్గరకు చేరుకుని పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వర్షాలు జోరందుకున్న తరుణంలో రైతులు తాము సాగు చేసిన పంటలకు యూరియా అవసరం కాగా, అది బయట మార్కెట్‌లో లభించకపోవడంతో లబోదిబోమంటున్నారు. రైతులు వ్యవసాయ పనులు వదిలి ఎరువులు సరఫరా చేసే పీఏసీఎస్ దగ్గర పడిగాపులు పడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని, పంటలను పండించుకునేందుకు యూరియా దొరకకపోవడం దారుణమని రైతులు వాపోయారు. గట్టు పీఏసీఎస్‌లో ఇప్పటి దాకా 3024 యూరియా బస్తాను రైతులకు అందించినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

కొరత లేకుండా చూడాలి : మాజీ మంత్రి

జిల్లాలో యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూరియా కొరత లేకుండా అవసమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన గద్వాలకు వచ్చి కలెక్టర్ బీఎం సంతోష్‌తో ప్రత్యేక భేటీ అయ్యారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. ప్రధానంగా యూరియా కొరతతో పాటు, జూరాల ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు, నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో సంగాల, తాటికుంట రిజర్వాయర్లను పూర్తిస్థాయి నీటితో నింపాలన్నారు. 99,100 ప్యాకేజీల పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం పలుసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బాసుహనుమంతు, కుర్వపల్లయ్య, రాజు, మోనేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి



ధర్మవరం హాస్టల్‌లో పైకప్పును పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఎర్రవల్లి: వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ధర్మవరం బాలుర వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ పైకప్పు పెచ్చులూడుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని, వర్షాల నేపథ్యంలో మరమ్మతులు చేపట్టాలని, అప్పటి వరకు విద్యార్థులను పాఠశాలలోనే వసతి కల్పించాలన్నారు. మరమ్మతు అంచనా నివేదికను వెంటనే సమర్పించాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిని నిశిత, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీరెడ్డి, వార్డెన్ జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లతో వర్షపు నీటిని ఎత్తిపోయాలి

మానవపాడు: భారీ వర్షాల కారణంగా అండర్ రైల్వే బ్రిడ్జిలలో నీరు నిలిచిపోతుందని, ఎప్పటికప్పుడు మోటార్లతో నీరు తొలగించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నారాయణపురం గ్రామం అండర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి మట్టం మరింత పెరిగిన సందర్భంలో, ప్రజలు సురక్షితంగా గ్రామానికి చేరుకునేందుకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఇతర మార్గాల ద్వారా రాకపోకలకు కొనసాగేలా చూడాలన్నారు. అండర్‌పాస్‌లను రెవెన్యూ సిబ్బంది, పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఎస్ఐ చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను కలెక్టర్ సంతోష్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పటిష్ట నిఘా



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అయిజ: జిల్లా సరిహద్దు నుంచి ఇతర రాష్ట్రాలకు యూరియా, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా చేయకుండా పోలీస్ అధికారులు పహారా కాయాలని ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న నాగల్‌దిన్నె బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను మంగళవారం రాత్రి ఎస్పీ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యూరియాను సరిహద్దు రాష్ట్రాలకు అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటలు నిఘా ఉంచి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ వెంట శాంతినగర్ సీఐ టాటాబాబు, అయిజ ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూరాలకు పోటెత్తిన వరద



జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు

- 2.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 38 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ధరూరు/రాజోళి/మదనాపురం/దేవరకద్ర: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. సోమవారం ప్రాజెక్టుకు 2లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 7.30 గంటల వరకు 2.45 లక్షలకు చేరినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 38 క్రస్టు గేట్లను ఎత్తి 2.47 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 24వేల క్యూసెక్కులు వదలగా.. 43 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.987 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సుంకేసుల డ్యాం వద్ద వరద ఉధృతి

సుంకేసులకు లక్ష క్యూసెక్కులు..

సుంకేసుల డ్యాంకు లక్ష క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతుంది. మంగళవారం ఎగువ నుంచి 1.30లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా..ఐదు గేట్లను ఒక మీటర్ మేర, 15 గేట్లను రెండు మీటర్ల మేర తెరిచి 1.25లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.



సరళాసాగర్ సైఫన్ల ద్వారా దిగువకు పారుతున్న నీరు

సరళాసాగర్‌లో ఐదు సైఫన్ల ద్వారా నీటి విడుదల

మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టుకు మంగళవారం సైతం వరద వస్తుండగా.. 3 వుడ్ సైఫన్లు, 2 ప్రైమరీ సైఫన్ల ద్వారా 11,350 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. ఇక శంకరసముద్రం ద్వారా ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో రామన్‌పాడు ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తి 22వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

కోయిల్‌సాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి మంగళవారం 2 గేట్లను ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. సోమవారం ఇన్‌ఫ్లో భారీగా రావడంతో అయిదు గేట్లను తెరిచి నీటి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు.. నీటి నిల్వ సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32 అడుగుల వద్ద 2.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో మొత్తం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. మంగళవారం ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఇప్పటివరకు 529.752 మి.యూనిట్లను విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

కమనీయం.. జములమ్మ కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్



మాంగళ్యాన్ని చూయిస్తున్న పండితుడు

గద్వాలటౌన్: చూడముచ్చటైన అమ్మవారి దివ్యరూపం.. పక్కనే త్రిశూల రూపంలో పెళ్లి కుమారుడిగా ఆసీనులైన జమదగ్ని మహర్షి.. పచ్చటి తోరణాలు, మేళతాళాలు.. అర్చకుల వేదమంత్రోచ్చారణాల నడుమ మంగళవారం నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి కల్యాణం కనులపండువగా జరిగింది. సాంప్రదాయబద్ధంగా దేవతామూర్తులను పూజించి పుణ్యాహవాచనం నిర్వహించి కన్యాదానం కొనసాగించారు. అంతకు ముందు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో జములమ్మ అమ్మవారిని, వరుడిగా త్రిశూలాన్ని ఊరేగింపుగా పెళ్లిపీటలపైకి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి యోక్త్రధారణ, త్రిశూలానికి యజ్ఞోపవిత ధారణ, సమస్త మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా మధ్యాహ్నం 12.15కి మాంగళ్యధారణ నయనానందంగా సాగింది. కల్యాణోత్సవానికి ముందు పలువురు దంపతులు సంకల్పం నిర్వహించారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

■ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వేర్వేరుగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించించారు. ఎమ్మెల్యే అమ్మవారికి నిత్య విశేష పుష్పాలంకారం చేసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచేగాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జములమ్మ నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జములమ్మ క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో చల్లంగా జీవించేలా అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పండితుల నుంచి ఇరువురు ఆశీస్సులు పొందారు. జములమ్మ కల్యాణంతో నడిగడ్డ సుభిక్షంగా వర్ధిల్లుతుందని పండితులు పేర్కొన్నారు. వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఈఓ పురేందర్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మాజీ చైర్మన్ సతీష్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీత భగత్

కొల్లాపూర్: కొల్లాపూర్ రేంజ్ పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీతభగత్ తెలిపారు. మంగళవారం ఆమె అమరగిరి సమీపంలోని బలపాలతిప్ప వద్ద చేపట్టిన టూరిజం డెవలప్‌మెంట్ పనులు, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను పరిశీలించారు. టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గూర్చి స్థానిక అధికారులకు సూచించారు. వన్యప్రాణుల మనుగడకు ఇబ్బందులు కలుగకుండా, పర్యాటక అభివృద్ధికి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సహకారం అందిస్తున్నట్లు వివరించారు. సోమశిలలోని లలితాంబికా సోమేశ్వరాలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కృష్ణానదిలో బోటులో విహరించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హీరేమత్, డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీఓలు రామ్మోహన్, చంద్రశేఖర్, రేంజర్ ఈశ్వర్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యూ పాయింట్ నుంచి అడవిని తిలకిస్తున్న సునీతభగత్, తదితరులు

గంజాయి ముఠా అరెస్టు

- 1.65 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితులు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం: తాపీ మేస్త్రీలు, బైక్ మోకానిక్‌లు, ఇంటర్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి ముఠా సభ్యులు గుట్టుగా జిల్లా కేంద్రంలో విక్రయాలు చేస్తున్నారు. కొన్ని నెలలుగా నిషేధిత మత్తు పదార్థాలను గద్వాల, అయిజకు చెందిన ముగ్గురు ముఠా సభ్యులు మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తులతో కొనుగోలు చేసి గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసిన నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. మంగళవారం కేసు వివరాలను పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గద్వాల పట్టణంలోని షేరెల్లివీధికి చెందిన బాషామియ్యా, అయిజకు చెందిన పూర్ణ అంబదాస్ అలియాస్ అజయ్, చాకలి పరశురాముడు కొన్ని నెలలుగా గంజాయి దందాను నిర్వహిస్తున్నారు. సోలాపూర్‌లో గంజాయి కేజీ రూ.4 వేల నుంచి రూ.6 వేలు తెచ్చి.. గ్రాముల లెక్కన పాకెట్లలో నింపి రూ.500 చొప్పున ఇక్కడి మేస్త్రీలు, కార్మికులు, ఇంటర్ విద్యార్థులకు గుట్టుగా విక్రయిస్తున్నారన్నారు. వారం రోజుల క్రితం పట్టణ శివారులో గంజాయి తాగుతూ ముగ్గురు యువకులు పట్టుబడిన విషయం విదితమే. యువకులు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి విక్రయాలపై నిఘా ఉంచామన్నారు. దీంతో ఈ వ్యవహారం వెలుగుల్లోకి వచ్చింది.

పక్కా సమాచారం మేరకు..

గద్వాల, అయిజకు చెందిన ముగ్గురు సోలాపూర్ నుంచి గంజాయి తీసుకొని మంగళవారం ఉదయం గద్వాల రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్నారు. దీంతో పట్టణ ఎస్ఐ, సిబ్బంది ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారితో తనిఖీ చేయగా 1.65 కేజీల గంజాయి గుర్తించామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 30 నుంచి 50 వేలు ఉంటుందన్నారు. గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్స్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ముఠా సభ్యులను విచారించగా ఆరు నెలలుగా 30మందికి పైగా యువకులకు గంజాయి విక్రయించినట్లు నేరం అంగికరించారన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని తెలిపారు. నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కేసు చేధనలో ఎస్ఐ కళ్యాణ్‌కుమార సాంకేతిక విభాగ సిబ్బంది చంద్రయ్య, కిరణ్, వీరేష్ కీలకంగా వ్యవహరించారన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బందికి రివార్డులను అందజేశారు. సమావేశంలో సీఐ శ్రీను, పట్టణ ఎస్ఐలు కళ్యాణ్‌కుమార్, సతిష్‌కుమార్‌రెడ్డి, జహంగీర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గోల్డ్ మెడల్ అందుకున్న అశ్విని



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయురాలు పోలె అశ్విని ఎంఏ తెలుగులో సంప్రదాయ సాహిత్య పాఠ్యాంశాలలో అత్యధిక మార్కులు సాధించి ఉస్మానియ యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. మంగళవారం ఓయూ 84వ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ బిష్ణుదేవ్‌శర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాలమూర్ యువకవుల వేదిక అధ్యక్షుడు బోలయాదయ్య పోలె అశ్వినికి అభినందనలు తెలియజేశారు.

కొండచరియల తొలగింపు



కొండచరియలు తొలగిస్తున్న పోలీసులు

దోమలపెంట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ఆనకట్ట ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. మంగళవారం ఈగలపెంట ఎస్ఐలు జయన్న, శ్రీను సిబ్బందితో కలిసి రోడ్డుపై పడిన రాళ్లను తొలగించారు. సోమవారం మధ్యాహ్న సమయంలో కొండచరియలు రోడ్డుపై పడ్డాయని పొక్లెయిన్ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం ఉదయం తొలగించినట్లు పేర్కొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థి మృతి

- పాఠశాల యాజమాన్యం, డ్రైవర్‌పై చర్యలకు డిమాండ్
- అలంపూర్–రాయిచూర్ రోడ్డుపై బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

ఇటిక్యాల/శాంతినగర్: ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును రివర్స్ తీయడంతో మంగళవారం సాయంత్రం బాలుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఇటిక్యాల మండలంలోని శనిగపల్లికి చెందిన కుమ్మరి వెంకటేష్, కృష్ణవేణి దంపతుల కుమారుడు వీరేష్ (6) శాంతినగర్‌లోని సరస్వతి పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లని వీరేష్ తన అక్క పాఠశాల నుంచి బస్సులో వస్తుందని మంగళవారం సాయంత్రం తల్లి వెంట బస్సు వద్దకు వెళ్లాడు. గ్రామానికి వచ్చిన సరస్వతి పాఠశాల బస్సును రివర్స్ తీసే క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త కారణంగా బస్సు వెనక ఉన్న బాలుడికి రక్తగాయాలై, అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన బాలుడి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు బాలుడి మృతదేహంతో మంగళవారం రాత్రి శాంతినగర్‌కు చేరుకొని, అలంపూర్–రాయిచూర్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. వారికి మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు నిలిచారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



శాంతినగర్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు

లింగాయిపల్లిలో చిరుత ప్రత్యక్షం

- రోడ్డు దాటుతున్న వాహనదారుడిపై దాడి
- రెండోసారి గండేడ్ మండలంలో సంచారం



చిరుత దాడిలో గాయపడ్డ నరేశ్

గండేడ్: ఇటీవల మహబూబ్‌నగర్ వాసులను కంటి మీద కునుకు లేకుండా చేసిన చిరుత తాజాగా గండేడ్ మండలంలో కలకలం రేపింది. మంగళవారం రోడ్డు దాటుతూ ఓ వాహనదారుడిని గాయపరిచింది. మండలంలోని లింగాయిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గత్పు నరేశ్ మంగళవారం సాయంత్రం 5:20 గంటల ప్రాంతంలో బైక్‌పై రంగారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో లింగాయిపల్లి నుంచి చింతగుట్టకు వెళ్లేదారి వద్దకు రాగానే చిరుత అకస్మాత్తుగా రోడ్డు దాటేందుకు దూకింది. అదే సమయంలో బైక్‌పై అక్కడికి చేరుకున్న నరేశ్ చేతికి చిరుత కాలు గీసుకుపోవడంతో ఎడమ చెతికి గాయమైంది. చిరుత చింతగుట్ట వైపునకు వెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. అనంతరం అతను గండేడ్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొన్నాడు. అయితే మరోసారి చిరుత గండేడ్ మండలంలో సంచరించడం మండల వాసులను భయాందోళనకు గురిచేస్తుంది. చింతగుట్ట వైపు వెళ్లిన చిరుత అవతలికి దాటే అవకాశం లేదు. ఎందుకంటే సాలార్‌నగర్ ప్రాజెక్టు నిండి ఉధృతంగా అలుగు పారుతుండడంతో ఇటువైపే సంచరించే అవకాశం ఉంది. భయాందోళనతో పొలాల వద్ద కట్టేసిన పశువులను స్థానికులు ఇళ్లకు తీసుకొచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

చిరుత సంచరించిన సమాచారం అందింది. బుధవారం ఉదయం ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తాం. అది చిరుతనా, పులినా, లేక ఇంకేమైనా తిరుగుతుందా పరిసరాలను పూర్తిగా పరిశీలిస్తాం. అప్పటి వరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– మహమ్మద్ అబ్దుల్ హై, రేంజర్, మహమ్మదాబాద్ రేంజ్

ఆలయాలే లక్ష్యంగా చోరీలు

- ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా 8 ఆలయాల్లో వెండి ఆభరణాల అపహరణ

భూత్పూర్: ఊరికి దూరంగా ఉన్న ఆలయాలనే లక్ష్యంగా చేసుకొని వెండి ఆభరణాలను దొంగిలించే నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 8 ఆలయాల్లో జరిగిన చోరీల్లో అతని ప్రమేయం ఉంది. ఈమేరకు మంగళవారం మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జూలై 31న సీసీకుంట గంగాభవాని ఆలయంలోని గర్భగుడి తాళం విరగ్గొట్టి వెండి ఆభరణాలు దొంగతనం చేయగా.. ఆగస్టు 1న కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈక్రమంలో మంగళవారం సీసీకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన తోక కర్ణాకర్ అనుమానాస్పదంగా కనిపించాడు. ఆలయ చోరీ సమయంలో సీసీ ఫుటేజీలో కనిపించిన అనుమానితుడిని.. ఇతడిని పోల్చి చూడగా ఒక్కరేనని గుర్తించారు. అదుపులోకి తీసుకొని ఆరా తీయగా గంగాభవాని ఆలయంలో చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. 2024 జనవరి 24 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు దూరంగా ఉన్న ఆలయాలను లక్ష్యంగా చేసుకొని వెండి ఆభరణాలను దొంగిలిస్తూ వచ్చాడు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 8 ఆలయాల్లో జరిగిన దొంగతనాల్లో తన ప్రమేయాన్ని అంగీకరించాడు. ఇందులో సీసీకుంట మండలం ముద్దూర్, పెద్దమందడి మండలం మద్దిగట్ల, వెల్టూర్, జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి, ఇటిక్యాల మండలం షాబాద్, సాతర్ల, పెబ్బేర్ మండలం వైశాఖాపూర్, కొత్తకోట మండలం చర్లపల్లి, మదనాపూర్ మండలం అజ్జకొల్లు, వనపర్తి పట్టణంలో చోరీకి పాల్పడ్డాడు. నిందితుడి నుంచి రూ.3,96,200 నగదు, రెండు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రతి ఆలయంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కేసు ఛేదించడంలో కృషి చేసిన సీసీకుంట ఎస్ఐ రామ్‌లాల్, నిరంజన్‌రెడ్డి, విష్ణు, బాల్‌రెడ్డి, రవిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

మోతెవరి లవ్‌స్టోరీలో అప్పాయిపల్లివాసి



ఓ సన్నివేశంలో చిరుతల బాలరాజు

సాక్షి, నాగర్‌కర్నూల్/ లింగాల: ఓటీటీ వేదికగా ఇటీవల విడుదలైన 'మోతెవరి లవ్‌స్టోరీ' వెబ్‌సిరీస్‌లో లింగాల మండలం అప్పాయిపల్లికి చెందిన చిరుతల బాలరాజు ముఖ్య పాత్రలో నటించారు. 'తెలుగు జీ5' ఓటీటీ ప్లాట్‌ఫాంలో విడుదలైన 'మోతెవరి లవ్‌స్టోరీ' వెబ్‌సిరీస్ వారం రోజుల్లోనే 50 మిలియన్ స్ట్రీమింగ్ మినట్స్ వ్యూయర్స్‌ను అందుకుని ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ వెబ్‌సిరీస్‌లో 70 ఏళ్ల వృద్ధుడు రాములు తాత పాత్రలో చిరుతల బాలరాజు మెప్పించారు. లింగాల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి, కొండనాగుల జూనియర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన బాలరాజు సినిమాలపై మక్కువతో సినీరంగంలో ప్రవేశించారు. పలు సీరియళ్లలో ఆర్టిస్టుగా, కో డైరెక్టర్‌గా పనిచేశారు. అల్లరే అల్లరి, సరదాగా కాసేపు, మిస్సమ్మ, ప్రతిఘటన, ప్రేమ ఎంత మధురం, అత్తో అత్తమ్మ కూతురో తదితర సీరియళ్లలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. తాజాగా ఓటీటీలో విడుదలైన మోతెవరి లవ్‌స్టోరీ వెబ్‌సిరీస్‌లో ముఖ్య పాత్ర రాములు తాతగా నటించి అలరించారు. నల్లమలలోని మారుమూల ప్రాంతానికి చెందిన బాలరాజు వెబ్‌సిరీస్‌లో అలరించడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి మహిళ బలవన్మరణం



గీత(ఫైల్)

పెద్దకొత్తపల్లి: భార్యాభర్తల గొడవ కారణంగా మనస్తాపానికి చెందిన భార్య ఇటీవల పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఎస్ఐ సతీశ్ కథనం ప్రకారం.. మరికల్‌కు చెందిన ఏడుపుల గీత (22) ఈనెల 17న భార్య, భర్తలు గొడవ పడి మనస్తాపంతో కలుపునివారణ మందు తాగింది. అపస్మారకస్థితికి చేరుకోవడంతో నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి నాలుగునెలల పాప ఉంది. మృతురాలి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడు గ్రామానికి చెందిన కస్తూరి(25) అనే యువతి నెల క్రితం నుంచి మండల కేంద్రంలోని పెద్దమ్మ సుగుణమ్మ ఇంట్లో ఉంటూ కూలి పనులకు వెళ్తుంది. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన అదృశ్యమైంది. ఎంతకూ ఆచూకీ తెలియక పోవడంతో మంళగవారం కస్తూరి అక్క సంధ్యపోగు సరస్వతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. గొర్రెలను మేతకు తీసుకెళ్లిన కాపరి రాగమోని మల్లయ్య(40) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. అక్కడే మరో కాపరి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఆర్ఐ గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. గొర్రెలను మేపేందుకు వ్యవసాయ పొలాలకు వెళ్లడంతో అక్కడ బోరుబావి వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతిచెందినట్లు ఆర్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్లు బంధులువు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలుశిక్ష

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో జరిగిన ఓ హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి కళార్చన తీర్పునిచ్చినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బింగి రామదాసుకు, బింగి శ్రీశైలంకు కొన్నేళ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. 2023, జూలై 14 రాత్రి రామదాసు గొర్రెల దగ్గరికి ఒంటరిగా వెళ్తుండగా గ్రామ శివారులో అప్పటికే మాటు వేసి ఉన్న శ్రీశైలం ఒక్కసారిగా గొడ్డలితో తలపై దాడి చేశాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రవిప్రకాష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం శ్రీశైలంను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ జరగగా మంగళవారం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బైక్ చోరీకి యత్నం.. పోలీసులకు అప్పగింత



జడ్చర్ల టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బైక్‌ను చోరీ చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తిని సెక్యూరిటీ నర్సింహులు పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. పూర్తి వివరాలు.. ఆర్టీసీ క్యాంటీన్ ఎదుట పార్క్ చేసి ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లేందుకు నిందితుడిని గమనించి పట్టుకున్నట్లు ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు.